


# నవభూమి
## వరంగల్
అనుబంధం

06 సెప్టెంబర్,2024 శుక్రవారం పేజీలు:3

www.epaper.navabhoomi.in


## చేతల్లో ఆదర్శం..
# బోధన వినూత్నం

**వరంగల్ –నవభూమి:** తాను కొవ్వొత్తిలా కరుగుతూ.. విద్యార్థుల్లో విజ్ఞాన వెలుగులు నింపేవారు గురువులు.కొందరు బోధనలో ప్రత్యేకత చూపుతూ.. బాలల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నారు. ఆటపాటలతో అర్థమయ్యేలా పాఠాలు బోధిస్తున్నారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పలువురు ఆదర్శ గురువులపై 'న్యూస్‌టుడే' కథనం..ఆంగ్ల భయాన్ని పోగొడుతున్నారు..!ఉపాధ్యాయుడి పేరు: శంకరభక్తుల సత్యం ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాల: జడ్పీ ఉన్నత పాఠశాల, లక్నేపల్లి(నర్సంపేట)ప్రస్థానం: నెక్కొండ మండలం చంద్రుగొండకు చెందిన శంకరభక్తుల సత్యం 1990 నుంచి 1998 వరకు నర్సంపేట ప్రాంతంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 1998లో ప్రభుత్వ కొలువు సాధించారు. 2005లో మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండ పాఠశాలలో మొదటిసారిగా ఆంగ్ల భాష ప్రయోగశాలను ప్రారంభించారు. ఆ తర్వాత 2015లో వరంగల్ జిల్లా సంగెం మండలం మొండ్రాయిలోనూ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న నర్సంపేట మండలం లక్నేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలోనూ ఆ దిశగా పనులు మొదలుపెట్టారు.ప్రత్యేకత: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఆంగ్లంలో మార్కులు తక్కువ రావడాన్ని చూసి.. దానికి పరిష్కార మార్గం ఆలోచించారు. పుస్తకాల్లోని అంశాలను ఉన్నది ఉన్నట్లుగా చెబితే విద్యార్థులు అర్థం చేసుకోవడం లేదని గ్రహించారు. పదో తరగతి విద్యార్థులు కూర్చునే గదిలో గోడలపై ఆంగ్ల వ్యాకరణాంశాలు రంగులతో రాయించారు. ఈయన పనిచేసిన పాఠశాలల్లోని పదో తరగతి గదుల్లోకి అడుగు పెడితే నలువైపులా రంగురంగుల వ్యాకరణాంశాలు కనిపించాల్సిందే. దానికయ్యే ఖర్చులో కొంత తానే భరించడం విశేషం.పురస్కారాలు 2020లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు.2020లో ప్రాజెక్టు ఆధారిత విద్యా బోధనపై జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్టీ) పురస్కారం.2021లో యునెస్కో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పోటీలకు దేశం నుంచి సత్యం మాత్రమే ఎంపిక కాగా.. ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.శాస్త్రీయ దృక్పథంతో.. రావుల దేవేందర్ మల్లంపల్లి ఉన్నత పాఠశాల, దుగ్గొండి మండలం 28 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు.గణితంలో పజిల్స్‌తో బోధన, విద్యార్థుల్లో మూఢ నమ్మకాలను పోగొట్టి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుతారు. అనాథ పిల్లలకు తనవంతుగా చేయూత అందిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ఇద్దరు విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందజేశారు. ఏటా తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు తల్లిదండ్రులతో తత్సంబంధాలు కొనసాగిస్తున్నారు.'సైన్సు'పై ఆసక్తిని పెంచుతూ..పిన్నింటి బాలాజీరావు ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెన్నారావుపేట మండలం భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు ఉప్పరపల్లి ఉన్నత పాఠశాలలో సీవీ రామన్ సైన్స్ క్లబ్ ఏర్పాటుచేసి విద్యార్థులతో పలు కృత్యాలు, ప్రయోగాలు చేయిస్తున్నారు. విద్యార్థులకు సామాన్య శాస్త్రంపై ఆసక్తిని పెంచి రాష్ట్రస్థాయి పోటీల వరకు తీసుకెళ్లారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ తక్కువ ఖర్చుతో ఎగ్జిబిట్లను తయారు చేసే విధంగా తీర్చిదిద్దారు.2014లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2016లో రోటరీ క్లబ్ నేషన్ బిల్డర్ అవార్డు, లయన్స్ క్లబ్, ఇతర స్వచ్ఛంధ సంస్థలు, ఉపాధ్యాయ సంఘాలతో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు.ఆటపాటలతో చెబుతూ.. బండ రవీందర్ వరంగల్ శంభునిపేట ప్రభుత్వ పాఠశాల వరంగల్ జిల్లా ఐనవోలు మండలం కొండపర్తి గ్రామానికి చెందిన ఆయన హిందీ భాషోపాధ్యాయుడు.హిందీ పాఠ్యాంశాల్లోని గేయాలను.. పాటలు, నృత్య రూపకంగా బోధిస్తారు. నృత్యాల రూపంలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, పండిత పరిషత్, రోటరీ క్లబ్ వారిచే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు.గణితంపై పట్టు సాధించేలా.. కందగట్ల శ్రీనివాస్ కొత్తూరు ప్రాథమిక పాఠశాల, రాయపర్తి మండల 2002లో ఉపాధ్యాయ కొలువు సాధించారు.చతుర్విధ ప్రక్రియలు అర్థమయ్యేలా బోధనోపకరణాలు తయారు చేసి పాఠాలు చెప్పడం.బోధనోపకరణాల తయారీలో మండల, జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు.



## అంతర్జాతీయ క్రీడాకారుల
# ఖిల్లా కల్లెడ

**వరంగల్, –నవభూమి:** చిన్నతనంలోనే పిల్లలకు క్రీడలపై ఆసక్తి కల్పించి వారిని ఆ దిశగా ప్రోత్సహిస్తే తిరుగుండదని నిరూపిస్తోంది కుగ్రామమైన కల్లెడ.వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని చిన్న ఊరు కల్లెడ. తాజాగా పారాలింపిక్స్‌లో కాంస్యం సాధించిన లక్ష్య క్రీడాకారిణి జీవాంజి దీప్తి స్వగ్రామం ఇదే. ఆమె ఒక్కరే కాదు.. 2008 వేసవి బీజింగ్ ఒలింపిక్స్‌లో ఆర్చరీ విభాగంలో పాల్గొన్న వర్ధినేని ప్రణీత కూడా కల్లెడ నుంచి ఎదిగినవారే. కల్లెడ పక్కనున్న పర్వతగిరి ఆమె స్వగ్రామం. ప్రస్తుతం ప్రణీత 'సాయ్' అకాడమీలో శిక్షకురాలిగా పనిచేస్తున్నారు. పదుల సంఖ్యలో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి కల్లెడలోని 'రూరల్ డెవలప్‌మెంట్ పాఠశాల' కృషి ఎంతో ఉందని చెప్పాలి. కల్లెడ ఆర్డీఎఫ్ పాఠశాల, కళాశాలలో విద్యాభ్యాసం చేసిన యువత ఆర్చరీ(విలువిద్య)తో పాటు అథ్లెటిక్స్, వివిధ క్రీడాంశాల్లో రాణించి మంచి కొలువులు సంపాదించారు. ఈ గ్రామానికి చెందిన యువతీ యువకులు క్రీడల్లో రాణించి ఆర్మీ, రైల్వే, బార్డర్ పోలీసు, సివిల్, ఏఆర్ పోలీసుశాఖలతోపాటు ఆర్చరీ కోచ్, ఆర్టీసీల్లో సుమారుగా 22 మంది ఉద్యోగాలు సాధించారు. నిరుపేద రైతు కూలీ కుటుంబానికి చెందిన జీవాంజి దీప్తి కల్లెడ పాఠశాల్లోనే విద్యాభ్యాసం చేశారు. ఆమె ప్రతిభను పాఠశాలలోని వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు గుర్తించి ప్రోత్సహించడంతో అంచెలంచెలుగా ఎదిగి నేడు పారాలింపిక్స్ పతకం గెలుపొందారు. 1996లో కల్లెడ రూరల్ స్కూల్ పేరిట పాఠశాలను ప్రారంభించారు. అనంతరం దాన్ని ఆర్డీఎఫ్‌గా మార్చారు. ఆర్డీఎఫ్ శాఖలుగా విస్తరించినా, కల్లెడలో ఆర్చరీ అకాడమీ ఉంది. ఇక్కడ ఆర్చరీలో ప్రాథమిక దశలో వందలాది మంది శిక్షణ పొంది ఉన్నత స్థాయికి ఎదిగారు. స్విమ్మింగ్ క్రీడలోనూ ఇక్కడి నుంచి ఎదిగినవారు ఉన్నారు.విమర్శించినోళ్లే.. అభినందించడం సంతోషంగా ఉంది జీవాంజి దీప్తితో తల్లిదండ్రులు ధనలక్ష్మి, యాదగిరి 'నా బిడ్డ మానసిక పరిస్థితిపై హేళన, విమర్శలు చేసినోళ్లే నేడు అభినందిస్తుంటే అంతులేని ఆనందంగా ఉంది' అని వరంగల్ జిల్లా కల్లెడ గ్రామానికి చెందిన పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన జీవాంజి దీప్తి తల్లిదండ్రులు ధనలక్ష్మి, యాదగిరిలు పేర్కొన్నారు. బుధవారం 'న్యూస్‌టుడే'తో తమ సంతోషాన్ని ఇలా పంచుకున్నారు.దీప్తి కాంస్య పతకం సాధించడం గురించి..: పతకం సాధించడంతో సంతోషంగా ఉంది. మొదటి, రెండో స్థానంలో రాణిస్తుందనుకున్నాం. ఇక్కడి, అక్కడి వాతావరణంలో మార్పులతో కొంత అనారోగ్యానికి గురవడంతో వెనుకపడినట్లు అనిపించింది. పారాలింపిక్స్‌లో ఆడటం గొప్పగా భావిస్తున్నాం.ఈ స్థాయికి రావడం వెనుక..: మారుమూల కల్లెడ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన మేము పిల్లలను చదివించడమే కష్టంగా ఉండేది. ఆ సమయంలో మా పరిస్థితులు చూసిన ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు వారి ఆర్డీఎఫ్ పాఠశాలలో మా ఇద్దరమ్మాయిలను చేర్పించుకున్నారు. ఆటలంటే ఇష్టపడే దీప్తిని పీఈటీ వెంకటేశ్వర్లు గుర్తించి పరుగు పందెంలో శిక్షణ ఇచ్చారు.



# జడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాటారంలో ఉపాధ్యాయులను సత్కరించిన విద్యార్థులు**

**ముఖ్య అతిథిగా హాజరైన మండల ప్రత్యేక అధికారి సంజీవరావు**





**కాటారం,సెప్టెంబర్ 5 నవభూమి ప్రతినిధి:** డాక్టర్.సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినం సందర్భంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాటారం విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా మండల ప్రత్యేకాధికారి సంజీవరావు హాజరైనారు.ముఖ్య అతిథి సంజీవరావు మాట్లాడుతూ... ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని,గురువులకు ఎన్ని సత్కారాలు చేసిన తక్కువే అని,ఈ రోజు ప్రత్యేకంగా ఉపాధ్యాయులను సన్మానించడం వారికి ఇచ్చే గౌరవమని అన్నారు.అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి ఉన్నత మైనదని, ఉపాధ్యాయులుగా సేవ చేయడానికి గర్వ పడుతున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు

## కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**కాటారం,సెప్టెంబర్ 5 నవభూమి ప్రతినిధి:**కాటారం మండల కేంద్రం లోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిసిడిఓ శైలజ హాజరయ్యారు.ఈ కార్యక్రమం లో భాగంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి జిసిడిఓ శైలజ, ప్రిన్సిపాల్ చల్ల సునీత లు పూలమాల వేసి గౌరవ వందనాలు చేసారు.ఉపాధ్యాయుల గొప్ప తనాన్ని విద్యార్థిని లు ఉపన్యాసాలు,నృత్యాలు,పాటలు ద్వారా వివరించడం జరిగింది.విద్యార్థినిలు అందరూ కలిసి ప్రిన్సిపాల్ చల్ల సునీత,ఉపాధ్యాయు లందరిని శాలువాలతో సన్మానించారు.ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు జిసిడిఓ శైలజ ను శాలువాతో సన్మానించడం జరిగింది.ఈ కార్య క్రమంలో జీసీడీవో శైలజ,ప్రిన్సిపాల్ చల్ల సునీత, సరిత,అరుణ,విజయ, రాజమణి,నళిని,లక్ష్మి, స్వప్న,సుజాత,శిరీష, మణిమాల,కవిత,రాజేశ్వరి, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.



### పలు గురుకులాల్లో దోమల నివారణకు

# పైరెత్రిన్ మందు పిచికారి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మధుసూదన్ ఆదేశాలతో జిల్లా ఎపడమిక్ టీమ్ పైరెత్రిన్ మందు స్ప్రే
- దామెరకుంట గ్రామంలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం
- కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్.మౌనిక







**కాటారం,సెప్టెంబర్ 5 నవభూమి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సిఎచ్ మధుసూదన్,జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్.ఉమాదేవి ల ఆదేశాల మేరకు కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మౌనిక ఆద్వర్యంలో గురువారం రోజున కాటారం మండల కేంద్రం లోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల,ఎస్సీ బాలికల గురుకులం, కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల, మేడిపెల్లి బాలికల గురుకుల పాఠశాల లలో జిల్లా ఏపాదమీక్ టీమ్ యూనిట్ ఆఫీసర్ టి.రమేష్ కుమార్ డెంగ్యూ ,మలేరియా జ్వరాలు రాకుండా పైరెత్రిన్ మందును స్ప్రే చేసారు.విద్యార్థులకు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు.దామెరకుంట గ్రామంలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరం ఉన్న వారికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.పలు గ్రామాలలో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు.సీజనల్ వ్యాధులు అయినటువంటి టైఫాయిడ్,డెంగ్యూ,మలేరియా, చికెన్ గున్యా,కలరా వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఇంటి పరిసరాల్లో కొబ్బరి బోండాలు,పాత సామాన్లు, టైర్లు,ప్లాస్టిక్ కవర్లు లేకుండా చూసు కోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని,దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని,తాగునీటిని కాచి వడబోసి చల్లార్చిన తర్వాతనే త్రాగాలని,వారానికి రెండు రోజులు మంగళ,శుక్ర వారాలు డ్రై డే ను నిర్వహించాలని ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్య క్రమంలో ఏంఎల్ఏచ్ పి డాక్టర్.తిరుపతి రెడ్డి, సిఎచ్ఓ నిర్మల,హెల్త్ అసిస్టెంట్ టి.సమ్మయ్య, ఏఎన్ఎం విజయలక్ష్మి,ఆశా వర్కర్లు సంధ్య, వసంత,శైలజ జిల్లా ఏపడమీక్ టీమ్ సబ్ యూనిట్ ఆఫీసర్ టి.రమేష్ కుమార్, టి.పరమేశ్వర్,కాపర్థి రాజు,గోపీకృష్ణ,వెంకట సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

# లబ్దిదారుల ఇంటి వద్దకే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు

- సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు చేయించిన మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు

**కాటారం,సెప్టెంబర్ 5 నవభూమి ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ఐటి శాఖ,పరిశ్రమల,శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంథని నియోజకవర్గంలోని మహాముత్తారం మండలానికి 19 చెక్కులు, మహదేవ్ పూర్ మండలానికి 20 చెక్కులు, పలిమెల మండలానికి 6 చెక్కులు ఇతర మండలాలకు చెందిన 31 సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరు చేసి ఇప్పించారు. మహాముత్తారం,మహాదేవపూర్,పలిమెల మండలాలకు చెందిన చెక్కును వారి గ్రామం వద్దకే వచ్చి మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు మహాముత్తారం మండలం యామన్ పల్లి, కొర్లకుంట,పెగడపల్లి,మహా ముత్తారం, రేగులగూడెం,స్తంభంపల్లి పిపి, కనుకునూరు, మీనాజీపేట(నల్లగుంట), పలిమెల మండలం సర్వాయిపేట,పంకెన,పలిమెల, మహాదేవపూర్ రాపల్లికోట,అంబటిపల్లి,ఎల్కేశ్వరం,కిష్టరావుపేట, సూరారం, కాలేశ్వరం, అన్నారం ఇతర గ్రామాల లబ్ధిదారులకు గురువారం రోజున చెక్కులు అందజేయడం జరిగింది.మంథని నియోజకవర్గం లోని పలు ఆస్పత్రి లలో అనారోగ్యంతో చికిత్స పొంది సహాయం కొరకు మంత్రి క్యాంప్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న వారికి ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు వీరికి ప్రభుత్వం నుండి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరు చేయించారు. మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు వారి ప్రభుత్వ వ్యక్తిగత (పిఎ) సహాయకులు ఆకుల చంద్రశేఖర్ వారి గ్రామానికి వెళ్లి వారి ఇంటి వద్ద ఈ చెక్కులు అందజేశారు.

















# మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శలు















**కాటారం,సెప్టెంబర్ 5 నవభూమి ప్రతినిధి:**కాటారం మండల కేంద్రంలో పలు కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మదూకర్ పరామర్శించారు.గంగాపురి గ్రామంలో గోనె పద్మ గారి సంవత్సరీకం కార్యక్రమం లో పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరాపూర్ గ్రామంలో గుంటి చిన్న మల్లయ్య మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.విలాసాగర్ గ్రామంలో పెండ్యాల రజిత అనారోగ్యం తో బాధ పడుతుండగా ఆమెను పరామర్శించి ధైర్యం ఉండాలని తెలిపారు.పప్పుల డేవిడ్ అనారోగ్యం తో బాధ పడుతుండగా వారిని పరామర్శించడం జరిగింది.ఇటీవలే మృతి చెందిన కనుగంటి వేంకటేశ్వర రావు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జక్కు రాఖేష్, బిఆర్ఎస్ పార్టీ మండల ఇంచార్జి జోడు శ్రీనివాస్,యూత్ అద్యక్షులు రామిళ్ళ కిరణ్,మాజీ ఎంపిటీసీ బాసాని రవి,ఎస్టీ సెల్ అద్యక్షులు తైనేని సతీష్, మాజీ యూత్ అద్యక్షులు నరివిద్ది శ్రీనివాస్, విలాసాగర్ అద్యక్షుడు కందికొండ రాజు, మునమంద మదూకర్,దామరకుంట గ్రామ శాఖ అద్యక్షులు శంకర్, శంకరాంపల్లి గ్రామ శాఖ అద్యక్షులు జాగిరి మహేష్,వీరాపూర్ గ్రామ సీనియర్ నాయకులు నరేందర్,అత్కూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీహెచ్ఎస్ దన్వాడలో ఉపాధ్యాయ దినోత్సవం






**కాటారం,సెప్టెంబర్ 5 నవభూమి ప్రతినిధి:** కాటారం మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దణ్వాడ లో సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం, ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయురాలు బి.శ్రీదేవి మాట్లాడుతూ... విద్యార్థులు రాధాకృష్ణన్ గారిని ఆదర్శంగా తీసుకుని,నైతిక విలువలను పెంపొందించుకుని జీవితంలో గొప్పగా ఎదగాలని,ఉన్నత ఉద్యోగాలు సంపాదించి ఈ ప్రాంతానికి సేవ చేసినప్పుడే చదువుకు సార్ధకత అని,గురువులను గౌరవించాలని,ఉపాధ్యాయ వృత్తి పరమ పవిత్ర మైనదని అన్నారు. తదనంతరం తనకు చిన్ననాడు పాఠశాల స్థాయిలో చదువు చెప్పిన ప్రతి సబ్జెక్టు టీచర్ బోధనను స్మరించుకుంటు, పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న అన్ని సబ్జెక్టు టీచర్ల సేవలను గుర్తించి,అందరు ఉపాధ్యాయులను సముచితమైన సాంప్రదాయ రీతిలో పట్టు వస్త్రాలతో సత్కరించారు.ఈ కార్య క్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్,రాజబాబు, వేంకటేశ్వర్లు,శరత్ బాబు,లక్ష్మయ్య,పర్వీన్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.అనంతరం విద్యార్ధిని విద్యార్థులు ప్రధాన ఉపాధ్యాయులతో పాటుగా ఉపాధ్యాయులందరిని ఘనంగా సన్మానించారు.

# చెరువులో పడి పశువుల కాపరి మృతి



**కాటారం,సెప్టెంబర్ 5 నవభూమి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ప్రథాపగిరి గ్రామ పంచాయతీ పరిధి లోని మద్రిపల్లి గ్రామానికి చెందిన పశువుల కాపరి నలుబోతుల రాజు తండ్రి.బోందయ్య వయస్సు.25 అనే వ్యక్తి గురువారం రోజున గ్రామ సమీపంలో లోని చెరువులో పడి మృతి చెందాడు.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం రొజ టి లాగానే గురువారం పశు వులతో గ్రామ పొలిమేరలో ఉన్నాడు.ఒక పశువు చెరువులోకి పోవడాన్ని గమనించిన పశువుల కాపరి రాజు పశువు కొరకు చెరువు లోకి దిగాడు.చెరువులో ఇటీవల తీసిన ఉపాధిహామీ గుంతలో పడి బయటకు రాలేక పోయాడు.చెరువులోనే చిక్కుకొని మృతి చెందాడు.మృతినికి ఇంకా వివాహం కూడా కాలేదని, యువకుడు మృతి చెందడం దుర దృష్ట కరమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

# ఉపాధ్యాయులను సత్కరించిన ఆత్మకూరి కుమార్

**కాటారం,సెప్టెంబర్ 5 నవభూమి ప్రతినిధి:** ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా పలువురు ఉపాధ్యాయులకు సన్మానం చేసిన ఆదర్శనగర్ కన్వీనర్ ఆత్మకూరి కుమార్ యాదవ్. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా గురువారం రోజున సాయంత్రం ప్రభుత్వ లెక్చరర్ పోటు తిరుపతి, సీనియర్ ప్రభుత్వ ఉపాధ్యాయులు హత్కర్ రమేష్ నాయక్ లను ఘనంగా సన్మానం చేయడం జరిగింది.



# ఉత్తమ ఉపాధ్యాయునిగా కొట్టే శ్రీశైలం



**కాటారం,సెప్టెంబర్ 5 నవభూమి ప్రతినిధి:** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం రోజు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో జిల్లా లోని పలువురు ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ,భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు లు సన్మానించారు.ఈ కార్యక్రమంలో భాగంగా కాటారం కు చెందిన సువిద్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ కొట్టే శ్రీశైలం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మేమెంటో ప్రశంస పత్రం అందుకున్నారు.ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన కొట్టే శ్రీశైలం ను పలువురు అభినందించారు.

# వ్యాధులపై అప్రమత్తం చేస్తున్నాం

**మహబూబాబాద్, –నవభూమి:** 'కాలానుగుణ వ్యాధులే కాకుండా ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల గ్రామాలు, ఇళ్లలోకి నీరు చేరడంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.అంటు వ్యాధుల బారిన పడకుండా నీటి ముంపునకు గురైన ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసేందుకు వైద్యారోగ్య శాఖ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ అవగాహన కల్పిస్తున్నారు' అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి.మురళీధర్ తెలిపారు.వరదల వల్ల ఎలాంటి వ్యాధుల బారినపడుతారు?డీఎంహెచ్వో: చెత్త, ఇతర వ్యర్థాలతో వరద నీరు కొట్టుకువచ్చి రహదారులు, ఇళ్లలోకి చేరడంతో అంటువ్యాధులు వ్యాపిస్తాయి. ప్రధానంగా వాంతులు, విరోచనాలతో డయేరియా వ్యాధులకు గురవుతారు. చర్మ వ్యాధులు కూడా రావొచ్చు.నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలంటారు?డీఎంహెచ్వో: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. ప్రతి రోజు డ్రై డే పాటించాలి. కలుషితమైన నీరు తాగకుండా శుద్ధి చేసిన నీటిని తాగాలి. కాచి వడబోసిన నీరు తీసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిది. వేడిగా ఉండే ఆహార పదార్థాలను భుజించాలి. డయేరియా లక్షణాలు కన్పించగానే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలి.

# నకిలీ ధ్రువపత్రాల ముఠా అరెస్టు

**మట్టెవాడ, –నవభూమి:** వరంగల్ తహసీల్దార్ కేంద్రంగా నకిలీ ధ్రువపత్రాలు తయారు చేస్తున్న పలువురిని బుధవారం మట్టెవాడ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు.ఏసీపీ నందిరాం నాయక్ కథనం ప్రకారం.. నగరానికి చెందిన పస్తం సతీష్ ఇటీవల తన వడ్డీ వ్యాపారం అనుమతి పునరుద్ధరణ(లైసెన్స్ రెన్యూవల్) కోసం వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. దానికి జతపర్చిన ధ్రువపత్రాలను పరిశీలించిన తహసీల్దార్ ఇక్బాల్ అవి నకిలీవని గుర్తించి మట్టెవాడ ఠాణాలో ఫిర్యాదు చేశారు.ఏళ్లుగా దందా..పస్తం సతీష్ వడ్డీ వ్యాపారం అనుమతి కోసం దేశాయిపేటకు చెందిన జూలూరి చక్రపాణి వద్దకు వెళ్లగా.. తహసీల్దార్‌కు సంబంధం లేకుండా ధ్రువపత్రాలు అందించే కొత్తవాడకు చెందిన గోవిందు సతీష్‌కుమార్‌ను పరిచయం చేశాడు. చక్రపాణి, మాన్యం సిద్దయ్య మధ్యవర్తులుగా వ్యవహరించి గోవిందు సతీష్‌కుమార్ నుంచి పలువురికి నకిలీ ధ్రువపత్రాలు అందించారు. మండిబజార్‌కు చెందిన ఖాజా మహ్మద్ అజారుద్దీన్ గతంలో కాజీపేటకు చెందిన సయ్యద్ సాబీర్, దామోదర్‌లకు కుటుంబ ధ్రువీకరణ పత్రాలు, ఎనుమాములకు చెందిన కాసెట్టి కమలాకర్, సిరంగి రమేశ్‌లకు ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ప్రభుత్వ పట్టాలు తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఇచ్చారు. గోవిందు సతీష్‌కుమార్ గతంలో పలువురి వద్ద డబ్బులు తీసుకొని వివిధ రకాలైన నకిలీ ధ్రువపత్రాలను తయారు చేసి ఇచ్చాడు. పోలీసు కేసు నమోదు కావడంతో నకిలీ ధ్రువపత్రాలు పొందిన వారంతా గోవిందు సతీష్‌కుమార్ ఇంట్లో బుధవారం సమావేశం కాగా.. విశ్వసనీయ సమాచారంతో అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. సతీష్‌కుమార్ ఇంట్లో దాచిన వరంగల్, కాజీపేట తహసీల్దార్, హనుమకొండ జిల్లా పేర్లతో ఉన్న రబ్బరు స్టాంపులు, రౌండ్ సీల్స్ స్టాంపులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సతీష్‌కుమార్‌కు రబ్బరు స్టాంపులు తయారు చేసిచ్చిన హనుమకొండ టైలర్ వీధికి చెందిన సముద్రాల కిరణ్‌కుమార్‌తోపాటు పస్తం సతీష్, గోవిందు సతీష్‌కుమార్, జూలూరి చక్రపాణి, మహ్మద్ అజారుద్దీన్, సయ్యద్‌సాబీర్, దామోదర్, కమలాకర్‌లు పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఉన్నారు.ఉద్యోగుల పాత్రపై అనుమానం.. తహసీల్దార్ కార్యాలయాలే కేంద్రంగా జరుగుతున్న నకిలీ ధ్రువపత్రాల దందాపై నగరంలో తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది.